క్లుప్తంగా

పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది



పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకున్న అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రామచంద్రాపురం పట్టణంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి బుధవారం పోలింగ్ సిబ్బంది, అధికారులు చేరుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. 2039 మంది పట్టభద్రుల ఓట్లకు గాను 3 పోలింగ్ కేంద్రాలు, 145మంది ఉపాధ్యాయుల ఓట్లకు సంబంధించి ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. పోలింగ్ కేంద్రం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

టీవీ, ఇన్వర్టర్ బహూకరణ



టీవీ, ఇన్వర్టర్‌ను అందజేస్తున్న బాధ్యులు

నారాయణఖేడ్: పట్టణంలోని మైనార్టీ బాలికల గురుకులానికి బుధవారం మైనార్టీ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రూ.65 వేల విలువ చేసే టీవీ, ఇన్వర్టర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా యాక్షన్ కమిటీ బాధ్యులు తాహెర్, మైనోద్దీన్‌లు మాట్లాడుతూ పరీక్షల సమయం కావడంతో కరెంటు సమస్య ఉన్న సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఇన్వర్టర్, టీవీని బహూకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సుబూర్, యూసుఫ్, గౌస్, సర్దార్, మోయిన్, మాజీద్, యాదు, శఫీ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులందరూ ఓటు వేయాలి

నవభారత్ నిర్మాణ్ యువసేన అధ్యక్షుడు మెట్టు శ్రీధర్

పటాన్‌చెరు టౌన్: నేడు జరిగే మెదక్ – ఆదిలాబాద్ – నిజామాబాద్ – కరీంనగర్ పట్టభద్రుల ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని, పోలింగ్ శాతాన్ని పెంచేలా కృషి చేయాలని నవభారత్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టు శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరక్షరాస్యులతో పోలిస్తే అక్షరాస్యులు ఎన్నికల్లో ఓటు వేయడానికి బద్ధకించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని.. ప్రశ్నించే గొంతుకలుగా మారాలంటే తమ కోసం పని చేసే అభ్యర్థికి ఓటు వేయాలన్నారు.

108 అంబులెన్స్ పని తీరు భేష్



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న హరిరామకృష్ణ

కొండపాక(గజ్వేల్): 108 అంబులెన్స్ సిబ్బంది పనితీరు బాగుందని సిద్దిపేట జిల్లా కోఆర్డినేటర్ హరిరామకృష్ణ కితాబిచ్చారు. బుధవారం 108ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఏ చికిత్సలకు ఏఏ మందులు, పరికరాలు వాడుతున్నారన్న అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరిరామకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు 108 అంబులెన్స్‌పై ఉన్న నమ్మకాన్ని బలపడేలా సేవ లందించాలని కోరా రు. చికిత్సను అందించడంలో నిర్లక్ష్యం చేయకూడదని చెప్పారు. మెడికల్ టెక్నీషియన్ మహేందర్, పైలట్ రమేష్ పని తీరు ప్రశంసనీయమని చెప్పారు.

దుర్గమ్మ జాతర ప్రారంభం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన దుర్గమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం పోతురాజు గావు, బండ్లు, బోనాల ఊరేగింపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎల్‌ఓసీ అందజేత

నర్సాపూర్: పట్టణానికి చెందిన సంజయ్‌కుమార్‌కు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ఆయన బుధవారం ఎల్‌ఓసీ అందజేశాడు. సీఎం రిలీఫ్ ఫండ్ పథకం నుంచి అవసరమైన ఆర్థికసాయం మంజూరు చేయించేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు హరీశ్ తదితరులు ఉన్నారు.

అంతా శివమయం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాల వద్ద పెద్ద ఎత్తున బారులు తీరి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉపవాస దీక్షలు ఉన్న భక్తులు స్వామి వారు దర్శనం అనంతరం విరమించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



పటాన్‌చెరు: బీరంగూడ గుట్టపై పూజలు నిర్వహిస్తున్న భక్తులు



నారాయణఖేడ్: స్వామివారికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు



పటాన్‌చెరు: స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



మునిపల్లి(అందోల్): బుదేరా భ్రమరాంభ మల్లిఖార్జునస్వామి దేవాలయంలో..



జోగిపేటలోని జోగినాథ ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



రామచంద్రారెడ్డినగర్ కాలనీలో...

చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి రాబిన్‌సన్ కన్నుమూత

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- 2010 నుంచి 2019 వరకు బాధ్యతలు
- నేడు అంత్యక్రియలు



మెదక్‌జోన్: మెదక్ సీఎస్ఐ చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి రాబిన్‌సన్(73) కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మెదక్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. 2010 నుంచి 2019 వరకు చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం రిటైర్మెంట్ తీసుకున్నారు. అంతకు ముందు చర్చి అధ్యక్ష మండలంలో వైస్ చైర్మన్‌గా, మినిస్ట్రీయల్ కన్వీనర్‌గా పని చేశారు. రాబిన్‌సన్‌కు భార్య దయాన రాబిన్, ఇద్దరు పిల్లలున్నారు. గురువారం మధ్యాహ్నం చర్చి ప్రాంగణంలోని శ్మశానవాటికలో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

మంచినీరు, మజ్జిగ పాకెట్ల పంపిణీ



వాటర్ బాటిళ్లు పంపిణీ చేస్తున్న భారతీ సిమెంట్ అధికారులు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల జాతరలో బుధవారం భారతీ సిమెంట్ ఆధ్వర్యంలో భక్తులకు నీరు, మజ్జిగ పాకెట్‌లు పంపిణీ చేసినట్లు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్)ఎంసీ.మల్లారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా భారతి సిమెంట్ ఆధ్వర్యంలో మజ్జిగ, వాటర్ బాటిళ్ల పంపిణీ చేస్తూ భక్తుల దాహం తీరుస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కంపెనీ ఏవీపీ టీ.కొండల్ రెడ్డి, చీఫ్ మార్కెటింగ్ మేనేజర్ టీ.సతీష్ కుమార్, టెక్నికల్ మేనేజర్ కే.సునీల్, సీనియర్ అధికారి(టెక్నికల్)వడ్ల శ్రీకాంత్, డీలర్లు పాల్గొన్నట్లు చెప్పారు.

బీసీలంతా ఐకమత్యంగా ఉండాలి

జహీరాబాద్ టౌన్: పట్టణంలో బుధవారం బీసీ నాయకుల సమావేశం నిర్వహించారు. పలు పార్టీలకు చెందిన నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీలంతా ఐకమత్యంగా ఉండాలన్నారు. ముఖ్యంగా రాజకీయంగా బీసీలు ఎదగాలని కోరారు. పట్టభద్రుల ఎన్నికల్లో బీసీకి చెందిన అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తట్టునారాయణ, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, నాయకులు నర్సింలు పాల్గొన్నారు.

పరమశివ మాగోడు విను..



కలశాలతో నల్లవల్లి, ప్యారానగర్ గ్రామస్తుల ర్యాలీ

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా చేస్తున్న నిరసనలు 21వ రోజుకు చేరాయి. మహాశివరాత్రి సందర్భంగా కలశాలతో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పరమశివుడికి అభిషేకం చేసి వారి గోడును విన్నవించుకున్నారు. నల్లవల్లి, ప్యారానగర్, గుమ్మడిదల గ్రామాల్లో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. స్థానిక రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం తరపున 1 లక్ష 50 వేల ఆర్థిక సహాయం జేఏసీ సభ్యులకు అందజేశారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు విరమించే వరకు నిరసనలు ఆపేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, రెడ్డి సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్లకు సన్మానం



సమావేశంలో మాట్లాతున్న రోజా

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ మాజీ పాలకవర్గ సభ్యులను శ్రీరామ్‌నగర్ కాలనీ ప్రజలు ఘనంగా సన్మానించారు. మంగళవారం రాత్రి స్థానిక నాయకులు పుండరీకం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాలనీలో జరిగిన అభివృద్ధిని ప్రశంసిస్తూ మాజీ చైర్ పర్సన్ రోజా, మాజీ జెడ్పీటీసీ బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డితో సహా మాజీ కౌన్సిలర్లను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ.. గడిచిన ఐదేళ్లలో రాజకీయాలకు అతీతంగా మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పని చేశామన్నారు. పదవులు ఉన్న లేకపోయినా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు. గత కొన్నేళ్లుగా సర్పంచ్, మున్సిపల్ చైర్ పర్సన్‌గా ప్రజాసేవ చేసే అవకాశాన్ని కల్పించిన మున్సిపల్ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

దివ్యాంగులకు నిత్యావసర సరుకులు, పండ్లు అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట మాజీ జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా జన్మదిన వేడుకలను బుధవారం బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. శివ్వంపేటలో పీఎంజీ టీం ఏర్పాటు చేసిన 46 కేజీల కేక్‌ని ఆయన కట్ చేశారు. మగ్దుంపూర్‌లోని బేతాని ఆశ్రమంలోని మానసిక దివ్యాంగులకు నిత్యావసర సరుకులు, పండ్లు అందజేశారు. శివ్వంపేటలో దుర్గమ్మ ఆలయం వద్ద లక్ష 16 వేల సొంత నిధులతో మహేశ్‌గుప్తా ఏర్పాటు చేసిన షెడ్డుని ప్రారంభించారు. ప్రయోగ్‌రాజ్ మహా కుంభమేళా నుంచి తెచ్చిన పవిత్ర నది జలాలను గ్రామంలోని ప్రతీ ఇంటికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ శ్రేణులు కృష్ణారావు, రమాకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మీనర్సయ్య, రాములుగౌడ్, వెంకటేష్, శేఖర్‌గౌడ్, పవన్‌గుప్తా, అశోక్, రాజేందర్, కొండల్, త్రినేష్, భూమేష్, కృష్ణాగౌడ్, ఖదీర్, రాజు, విఠల్, తదితరులు ఉన్నారు.

నత్తనడకన రోడ్డు విస్తరణ

- ఏడాది కావస్తున్న పూర్తి కాని పనులు
- అసంపూర్తి పనులతో వాహనదారుల ఇబ్బందులు



సంగుపేట వద్ద రోడ్డుకు ఇరువైపులా తవ్విన కాంట్రాక్టర్

వట్‌పల్లి(అందోల్): సంగుపేట శివారు నుంచి అన్నాసాగర్ వరకు ఫోర్‌లేన్ రోడ్డు ఏర్పాటుకు సంబంధించిన పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా నత్తనడకగా సాగుతున్నాయి. ఏడాది కాలంలో పూర్తి కావాల్సిన పనులు కనీసం 2కి.మీ వరకు కూడా చేపట్టలేదు. ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులకు రూ.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ పనులకు శంకుస్థాపన చేశారు. రోడ్డుకు ఇరువైపులా రోడ్డును వెడల్పు చేసి సిమెంట్ కంకరతో పూడ్చివేసి దానిపై నుంచి బీటీ చేయాల్సి ఉండగా పనులు వేగంగా జరగడంలేదు. మంత్రి అందోల్ వైపు పర్యటన ఉన్న సమయంలోనే పనులను చేపట్టినట్లుగా జేసీబీలు ఇతర యంత్రాలను తెప్పించి పనులు చేపడుతున్నారు. తర్వాత మూడు రోజులు పనులు చేపట్టి మరో మూడు రోజులు పనులు నిలిపివేస్తున్నారు. పనులు ప్రారంభించి ఏడాది కావస్తున్నా కనీసం రెండు కి.మీ వరకు కూడా పనులు చేపట్టలేదు.

ఆశ్చర్యపోయిన అధికారులు

విస్తరణ పనులను ఇటీవల పరిశీలనకు రోడ్లు భవనాల శాఖ ఈఈ రాంబాబు, డిప్యూటీ ఈఈ రవీందర్ సంగుపేట శివారు వద్ద జరుగు తున్న పనుల వద్దకు రాగా, పనులు జరగుతున్నట్లు కనిపించకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్‌కు ఫోన్‌లు చేసినా స్పందించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.

పనులపై మంత్రి అసంతృప్తి

రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా సాగడంలేదని మంత్రి దామోదర రాజనర్సింహ సైతం అసంతృప్తితో ఉన్నారు. అందోల్, జోగిపేట ప్రాంతంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి రోడ్డు పనులపై సంబంధిత అధికారులను ప్రశ్నించారు. తాను నియోజకవర్గానికి వచ్చినప్పుడే పనులు చేస్తున్నారా? అని కూడా ప్రశ్నించారు. వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

అన్నాసాగర్ వరకు డివైడర్ ఏర్పాటు

సంగుపేట శివారు నుంచి అందోల్, జోగిపేట భారత్ పెట్రోల్ పంపు వద్ద నుంచి అన్నాసాగర్ వరకు రోడ్డు డివైడర్‌ను ఏర్పాటు చేసి ఇరువైపులా రోడ్డు వెడల్పు పనులు చేపడతాం. అందోల్ పాలిటెక్నిక్ పాఠశాల వరకు ఇరువైపులా రోడ్డు వెడల్పు పనులు ప్రారంభమయ్యాయి. పనుల్లో భాగంగా రోడ్డు పక్కన ఉన్న చెట్లను కూడా తొలగిస్తున్నాం. రోడ్డు పనులకు గాను రూ.20 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.

–రవీందర్ డిప్యూటీ ఈఈ ఆర్అండ్‌బీ

చెట్లు నరికివేత



రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఇరువైపులా ఉన్న వందల ఏళ్ల చరిత్ర కలిగిన రాగి చెట్లను నరికివేశారు. చెట్ల తొలగింపు తప్పనిసరి కావడంతో నరికివేశారు. వందల సంఖ్యలో ఉన్న చెట్లు కానరాకుండా పోయాయి. ఈ దారిగుండా ద్విచక్రవాహనాలపై వెళ్లే వారు ఈ చెట్ల కింద సేద తీరేవారు. ఈ చెట్లను టెండర్ వేసి విక్రయించారా? అధికారుల ఆదేశాల మేరకు తొలగించారా అన్న విషయంపై స్పష్టత లేదు.

ఆకాశాన్నంటిన పండ్ల ధరలు



కౌడిపల్లి(నర్సాపూర్): మహాశివరాత్రి సందర్భంగా బుధవారం పండ్ల ధరలు ఆకాశాన్నంటాయి. పండుగ సందర్భంగా ఉపవాసదీక్ష చేపట్టిన ప్రతీ ఒక్కరు పండ్లు తిని. దీక్ష విరమిస్తారు. దీంతో పండ్ల వ్యాపారులు ఒక్కసారిగా ధరలను పెంచారు. అరటిపండ్లు డజన్ రూ. 80 నుంచి రూ 100 విక్రయించారు. అలాగే వాటర్ మిలాన్ సైజును బట్టి రూ. 100కు పైగా విక్రయిస్తున్నారు. ద్రాక్ష రూ. 100కిలో, సంత్రాలు, పైనాపిల్, దానిమ్మ అన్నింటి ధరలను పెంచారు.

క్రీడల్లో యువత సత్తా చాటాలి

సీఐ లతీఫ్



క్రీడాకారులకు జర్సీలు అందజేసిన సీఐ లతీఫ్, స్వామి

తొగుట(దుబ్బాక): గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని సీఐ లతీఫ్ సూచించారు. మండలంలోని ఎల్లారెడ్డిపేటలో శివరాత్రి పర్వదినం సందర్భంగా మాజీ ఎంపీటీసీ వెలుపుల స్వామి నిర్వహించిన క్రికెట్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. మాజీ ఎంపీటీసీ క్రీడలు నిర్వహించి యువతను ప్రోత్సహించడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం స్వామి మాట్లాడుతూ.. క్రికెట్ పోటీల్లో 8జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ 10వేలు, ద్వితీయ బహుమతి రూ 5వేలు నగదు 27న సీఐ చేతుల మీదుగా అందజేస్తామని తెలిపారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

బెజ్జంకి(సిద్దిపేట): ఆర్‌వీఎంబీపీ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఓపెన్ గు ఆల్ క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం బెజ్జంకిలో ప్రారంభించారు. ఈ టోర్నీలో విన్నర్ జట్టుకు రూ.లక్ష, రన్నరప్ జట్టుకు రూ.50 వేలు నగదుతో పాటు షీల్డులు అందిస్తామని అకాడమీ కమిటీ తెలిపింది. అనంతరం బెజ్జంకి ఎస్ఎల్ఎస్ జట్టు, గుగ్గిల్ల జట్టులతో ఫ్రెండ్లీ మ్యాచ్ నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు మహేందర్, సీపీఐ మండల కార్యదర్శి రూపేష్, కమిటీ సభ్యులు మానాల రవి, మధు, సూర్యప్రకాష్, సురేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో అందరికీ అందని దుస్తులు

సగం మంది చిన్నారులకే పంపిణీ



అంగన్‌వాడీ కేంద్రంలో దుస్తులు అందిస్తున్న సీడీపీఓతో అధికారులు (ఫైల్)

హుస్నాబాద్‌రూరల్: అంగన్‌వాడీ కేంద్రంలోని కొందరి చిన్నారులకే దుస్తులు పంపిణీ చేశారు. మిగతావారికి నేటికీ అందించలేదు. అంగన్‌వాడీ కేంద్రం పిల్లలకు కూడా దుస్తులు అందించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో గత ఏడాది ఆగస్టులోనే ఒక్కొక్క విద్యార్థికి రెండు జతల దుస్తులను శిశు సంక్షేమశాఖ నుంచి సరఫరా చేశారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకే దుస్తులు సరఫరా చేశారు. మరో కేంద్రంలోని చిన్నారులకు అందించలేదు. దీంతో తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇస్తే అందరికీ ఇవ్వాలని, పిల్లల మధ్య వ్యత్యాసం చూపడంపై అంగన్‌వాడీ టీచర్లను ప్రశ్నిస్తున్నారు.

హుస్నాబాద్ ప్రాజెక్టు పరిధిలోని అక్కన్నపేట, హుస్నాబాద్, కోహెడ, బెజ్జంకి మండలాల్లో 211 కేంద్రాల్లో 4,324 మంది విద్యార్థులున్నారు. ప్రభుత్వ పాఠశాలల ఆవరణలోని 98 కేంద్రాల్లోని 2,376 మంది చిన్నారులకు రెండు జతల దుస్తులను అందించారు. మిగతా 113 కేంద్రాల్లోని 1,948 మంది విద్యార్థులకు దుస్తులు అందలేదు. పోతారం(ఎస్) గ్రామంలో ఒకటి పాఠశాలలో, మరో కేంద్రం ఎస్సీ కాలనీలో ఉంది. పాఠశాలలో ఉన్న అంగన్‌వాడీ పిల్లలకు దుస్తులు ఇచ్చి ఎస్సీ కాలనీ పిల్లలకు దుస్తులు ఇవ్వకపోవడంతో వారి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దుస్తులు రాగానే అందిస్తాం

మా ప్రాజెక్టు పరిధిలో 211 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 98 కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో నడుస్తున్నాయి. మిగతా కేంద్రాలు ఆయా గ్రామాల్లో నిర్మించిన అంగన్‌వాడీ భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. ఒక ఊరులో రెండు కేంద్రాలు ఉన్నప్పుడు ఒక కేంద్రానికి ఇచ్చి మరో కేంద్రానికి ఇవ్వవకపోతే ఎవరికైనా కోపమే.. దుస్తులు రాగానే అందిస్తాం.

–జయ, సీడీపీఓ, హుస్నాబాద్

సెలవు రోజుల్లో తరగతులా..?

ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆదిత్య



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆదిత్య, తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మహాశివరాత్రి పర్వదినం నాడు ప్రభుత్వం సెలవు ప్రకటించినా కార్పొరేట్ పాఠశాలలు తరగతులను నిర్వహించడం సరి కాదని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆదిత్య అన్నారు. బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజున తరగతులు నడుపుతున్న కార్పొరేట్ పాఠశాలల తరగతులను బహిష్కరించారు. ఆదిత్య మాట్లాడుతూ.. పలు పాఠశాలలు సెలవు రోజున కూడా తరగతులను నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయని తెలిపారు. ఇలాంటి పాఠశాల యాజమాన్యంపై విద్యాశాఖ అధికారులు దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి పరశురాం, జోనల్ ఇన్‌చార్జి సాయిశంకర్, టెక్నికల్ సెల్ కన్వీనర్ వసంత్ తదితరులు పాల్గొన్నారు.